ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 26 ఆగస్టు 2025


బొబ్బిలి: పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక విగ్రహాలు

వినాయక సంబరాలకు ఏర్పాట్లు షురూ..

విజయనగరం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక సంబరాలకు జిల్లాలో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. మట్టి ప్రతిమలపై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. భారీ విగ్రహాలను కూడా మట్టితో తయారు చేసిన వాటిని కొలువుదీర్చనున్నారు. దాదాపు పందిళ్లు, మండపాలు సిద్ధమైపోయాయి. వర్షంతో కాస్త ఆటంకం కలిగినా రాత్రీపగలు పనిచేసి అలంకరణ పనులు పూర్తి చేశారు. ఇక బుధవారం ఉదయం నుంచే గణనాథుడు పూజలందుకోనున్నాడు. ఈ ఉత్సవాలు 1, 3, 5, 7, 9, 11, 13, 21 రోజులు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది చంద్రగ్రహణం పడడంతో తొమ్మిది రోజులకే నిమజ్జనం చేసేందుకు నిర్ణయించారు. విజయనగరంలోని కొత్తపేటలో కుమ్మరవీధి, దాసన్నపేటలోని కుమ్మరవీధి, ఫూల్‌బాగ్ కాలనీ, వీటీ అగ్రహారం, అయ్యన్నపేటతో పాటు జిల్లాలో నెల్లిమర్ల, చీపురుపల్లి, గరివిడి, గజపతినగరం, బొబ్బిలి, రాజాం, ఎస్.కోట తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను విరివిగా తయారు చేశారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసే సంఘాలు మట్టి వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిస్తూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిమల పంపిణీ కూడా చేపట్టారు. విజయనగరంలో స్పార్క్స్ సంస్థ, పర్యావరణ పరిరక్షణ సమితితో కలిసి మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని 20 ఏళ్లుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది.

ఆధ్యాత్మికం.. పర్యావరణ హితం 6


ముక్కాం తీరంలో పడవలు

'అల'కల్లోలం

భోగాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. సోమవారం సముద్రతీర ప్రాంత గ్రామాలైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు వద్ద సముద్రం పైనుంచి గాలులు తీవ్రంగా వీయడం, కెరటాలు ఉధృతంగా రావడంతో మత్స్యకారులు టెన్షన్ పడ్డారు. వారంతా తీరానికే పరిమితమయ్యారు. మరింతగా వర్షాలు పడే అవకాశం ఉందని తహసీల్దార్ రమణమ్మ తెలిపారు.

కేసు పంపిస్తే.. కమీషన్ కొట్టు



- కొందరు ఆర్‌ఎంపీలు, పీఎంపీల తీరిదీ
- ఫలానా ఆస్పత్రికి వెళ్లాలని రోగులకు సూచనలు
- అక్కడ ఆర్థిక దోపిడీకి గురవుతున్న వైనం
- 30 శాతం మొత్తం ఆస్పత్రికి పంపించిన వారికే

వైద్య సేవలు వ్యాపారం అయిపోయాయి. సేవ అర్థం మారిపోతోంది. రోగులకు సహాయం చేస్తున్నట్లు నటించి వారికే తెలియకుండా దండుకుంటున్నారు. ఫలానా వైద్యుని వద్దకు వెళ్లండి బాగా చూస్తారు.. తాను కూడా మాట్లాడతాను అని రోగికి చెబుతారు. దీంతో రోగి చాలా నమ్మకంతో వెళ్తాడు. అక్కడకు వెళ్లాక రోగం తగ్గుతుందో లేదో కాని ఆర్థికంగా దివాలా తీస్తున్నాడు. ఈ విధంగా కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో కమీషన్ల దందా నడుస్తోంది. రోగి పెట్టే ఖర్చులో 30 శాతం సిఫారసు చేసిన వ్యక్తికి అందుతోంది.


విజయనగరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గతంలో ఫలానా డాక్టర్ దగ్గరకు వెళ్తే ఫలానా వైద్యం అందుతుందని ప్రజలకు ఒకరకమైన నమ్మకం. నేడు ప్రత్యేక వైద్య నిపుణుల పేరుతో కొత్త సంస్కృతి పుట్టుకొచ్చింది. ప్రాథమిక వైద్యం కోసం స్థానికంగా ఉండే ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ల వద్దకు వెళుతుంటే.. వారు ముందస్తు బేరం కుదుర్చుకొని కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యుల వద్దకు పంపిస్తున్నారు. ముందుగానే 'నాకింత' అని బేరం కుదుర్చుకుంటున్నారు. సంబంధిత కార్పొరేట్ ఆస్పత్రులు రోగి వద్ద (మిగతా 8వ పేజీలో..)

- విజయనగరంలోని ఓ పేరుమోసిన కార్పొరేట్ ఆస్పత్రిలో అన్నిరకాల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. అయితే చికిత్సకు వచ్చేవారిలో అక్కడి సేవలు చూసి నమ్మకంతో చేరే వారు అరుదు. ఆర్‌ఎంపీలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, గ్రామాల్లోని ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు సూచించిన వారే ఎక్కువగా వస్తుంటారు. రోగి తనకు సాయంగా ఆర్‌ఎంపీలు వస్తున్నారని భావిస్తుంటారు కానీ అక్కడయ్యే ఫీజులో 10 నుంచి 20 శాతం ఆ ఆర్‌ఎంపీ ఖాతాకు వెళ్తాయట. అలాగని డబ్బులు చేతికి ఇవ్వరు. ప్రతి ఆర్‌ఎంపీ బ్యాంక్ అకౌంట్ కార్పొరేట్ ఆస్పత్రి వద్ద ఉంటుంది.
- చీపురుపల్లి ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికకు ఆపరేషన్ అవసరమైంది. ఆమె స్థానికంగా ఉన్న ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్‌ను ఆశ్రయించింది. దీంతో ఆ పీఎంపీ విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తూ చీటీ రాసి ఇచ్చారు. కానీ రూ.30 వేలతో తేలిపోయే ఆపరేషన్‌కు ఏకంగా రూ.60 వేలు వరకూ అక్కడ వసూలు చేశారు.

దృష్టి పెడతాం

ప్రైవేటు ఆస్పత్రులపై దృష్టిపెడతాం. ముఖ్యంగా అవుట్ పేషెంట్ టోకెన్ ధరల నియంత్రణకు కృషిచేస్తాం. ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించి ధరలు నియంత్రించేలా చేస్తాం. కచ్చితంగా ఆస్పత్రుల యాజమాన్యాలు నోటీస్ బోర్డుల్లో అన్ని వివరాలను ప్రదర్శించాలి. లేకుంటే చర్యలు తప్పవు.

- జీవనరాణి, డీఎంహెచ్‌వో, విజయనగరం



స్త్రీ శక్తి పథకానికి అనూహ్య స్పందన 6
● జిల్లా ప్రజా రవాణా అధికారి వరలక్ష్మి

రాజాంలో విజిలెన్స్ దాడులు
● రూ.16 లక్షల విలువచేసే ఎరువులు సీజ్ 6

రూ.22 లక్షల చీటీ సొమ్ము గోల్‌మాల్
● పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన 7

మెంటాడను మన్యంలో కలపొద్దు 7
● కలెక్టర్‌కు జేఏసీ నాయకుల వినతి

ప్రమాదకర ప్రయాణం 7
● కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి
● ఎస్పీ వకుల్‌జిందాల్ 7


కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున చేరుకున్న విద్యార్థులు

దద్దరిల్లిన కలెక్టరేట్

- సమస్యలపై కదంతొక్కిన విద్యార్థులు
- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

విజయనగరం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నిరసనతో కలెక్టరేట్ సోమవారం దద్దరిల్లింది. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీగా కలెక్టరేట్‌ను ముట్టడించారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందంటూ వేలాదిమంది కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్‌కు చేరుకున్నాక ధర్నా చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేష్‌లు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించే (మిగతా 8వ పేజీలో..)

ఆదరించాలి.. అప్రమత్తంగా ఉండాలి!

జాగ్రత్తలు తీసుకోవాలి : జయప్రకాష్, ఏడీ, పశుసంవర్ధకశాఖ, రాజాం

కుక్కల పెంపకం అనేది మంచిదే అయినా.. వాటి పెంపకంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వాటికి వ్యాక్సినేషన్, వాటి వ్యాధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే మనం మూల్యం చెల్లించుకుంటాం.

- కుక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందే
- పట్టణాల్లోని ప్రతివార్డులో షెల్టర్లు
- సుప్రీంకోర్టు ప్రత్యేక ఆదేశాలు
- నేడు జాతీయ కుక్కల దినోత్సవం

కుక్కను విశ్వాసానికి మారుపేరుగా భావిస్తున్నారు. పెంచుకుంటే యజమానితో పాటు కుటుంబానికి సైతం అండగా ఉంటుందన్న ఆలోచన అందరిలో పెరిగింది. అందుకే వాటిని విరివిగా పెంచుతున్నారు. చేరదీస్తున్నారు. అదే సమయంలో వీధికుక్కల సంతతి కూడా పెరుగుతోంది. వీటి నియంత్రణ విషయంలో స్థానిక సంస్థలు పట్టించుకోవడం లేదు. వీటి నియంత్రణ, సంతానోత్పత్తి అదుపునకు శస్త్రచికిత్సలు జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే దేశ అత్యున్నత న్యాయస్థానం స్థానిక సంస్థలకు కీలక ఆదేశాలు ఇచ్చింది. వీధికుక్కల సంతానోత్పత్తిని నియంత్రించే టీకాలు వేయడంతో పాటు వాటికి సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్దేశించింది. నేడు జాతీయ కుక్కల దినోత్సవం సందర్భంగా కథనం..

- వీధి కుక్కల సంరక్షణకు, వాటికి ఆహారం అందించేందుకు మునిసిపాల్టీల్లో ప్రతి వార్డులో షెల్టర్ ఏర్పాటుచేయాలి. అక్కడే ఆహారం అందించాలి. డీవార్మింగ్, టీకాలు వేసిన తరువాత తిరిగి విడిచిపెట్టాలి. కరిచే స్వభావం, రేబిస్ లక్షణాలు ఉండే కుక్కలను మాత్రం షెల్టర్‌లోనే ఉంచాలి.

- ఇటీవల సుప్రీంకోర్టు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన ఆదేశాలివి..


బొబ్బిలి: పెంపుడు కుక్కలతో రాజగోపాలనాయుడు

రాజాం/బొబ్బిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా కుక్కలు రెండు రకాలు. పెంపుడు కుక్కలు, వీధి కుక్కలు. ఇటీవల కుక్కల పెంపకం అనేది ఒక హాబీగా మారిపోయింది. గతంలో పట్టణాలు, నగరాల్లోనే ఈ సంస్కృతి ఉండేది. నేడు పల్లెలకు కూడా పాకింది. అయితే కుక్కల పెంపకంలో చాలా రకాల జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. పెంపుడు కుక్కలకు కూడా వయసు అవుతున్న క్రమంలో అనేక రకాల రుగ్మతలు చేరతాయి. అందుకే సమయానుకూలంగా వాటికి టీకాలు తప్పనిసరి. ఎంతగా అవి మన పట్ల ప్రేమ చూపినా..శారీరక, మానసిక స్థితి వల్ల కరవడానికి కూడా (మిగతా 8వ పేజీలో..)

పెంపుడు కుక్కలంటే ఇష్టం



నాకు పెంపుడు కుక్కలంటే ఇష్టం. రెండేళ్ల వయస్సు ఉన్న నా విస్కీ అంటే మరింత అభిమానం. ప్రతీ నెలా దీనికి సుమారు ఐదువేల రూపాయలు ఖర్చు చేసి హెయిర్ కటింగ్ చేయిస్తాం. ఓ చిన్న పిల్లాడి మాదిరిగా దీనిని సాకుతాం. ఇంకో కుక్క రాకీ జర్మన్ షెపార్డ్ జాతి. పోలీసులకు సర్వీసు చేసే కుక్కగా పిలుస్తారు. మూగజీవాలతో బంధం ఉన్న వారు వీటిని విడిచిపెట్టలేరు.

- తెంటు లక్ష్మునాయుడు, బుడా చైర్మన్, బొబ్బిలి

కటాఫ్ ఎంత?

- మెగా డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ
- నేడు కాల్ లెటర్ల డౌన్‌లోడ్‌కు అవకాశం
- ఈ నెల 28 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

సాలూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్ట్ విడుదలైన నేపథ్యంలో ఉపాధ్యాయ పోస్టుల ఎంపికకు కటాఫ్ మార్కులు ఎన్ని ఉండొచ్చననే ఉత్కంఠలో అభ్యర్థులు ఉన్నారు. దీనిపై ఎవరికి వారు అంచనా వేసుకుంటూ.. వాకబు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఓసీకి 84.71 మార్కులు, ఓసీ ఈడబ్ల్యూఎస్ 73.11, బీసీ-ఏ 80.64, బీసీ-బీ 80.81, బీసీ-సీ 67.33, బీసీ-డీ 83.98, బీసీ-ఈ 64.39, ఎస్సీలకు 82.91 నుంచి 78.34, ఎస్టీలకు 74.38 వరకు మార్కుల కటాఫ్ ఉండొచ్చని భావిస్తున్నారు. నాన్ లోకల్‌లో సైతం కటాఫ్ అత్యధిక మార్కులు ఉండే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. దీనిపై ఈ నెల 26 మధ్యాహ్నం స్పష్టత రానుంది. కాగా ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీల్లో 583 పోస్టులను భర్తీ (మిగతా 8వ పేజీలో..)

యూరియా కోసం రైతుల బారులు


6
ఎల్.కోట: యూరియా కోసం రేగలో రైతుల క్యూ


స్మార్టు రేషన్‌కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

7 లో

బార్లపై తగ్గిన ఆసక్తి!



- 28 బార్లకు 42 మంది మాత్రమే రిజిస్ట్రేషన్
- నాలుగు దరఖాస్తుల నిబంధనే కారణమా?
- మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లూ అడ్డంకే
- నేటి సాయంత్రంతో ముగియనున్న గడువు

విజయనగరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్ల నిర్వహణపై ఆసక్తి అంతంతమాత్రంగా కనిపిస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు పెద్దగా ముందుకు రావడం లేదు. జిల్లాలో 28 బార్లకుగాను కేవలం 42 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో ఇద్దరు మాత్రమే నగదు చెల్లింపులు చేశారు. కొద్దిరోజుల కిందట ఏపీ ప్రభుత్వం బార్ పాలసీని ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 800కుపైగా బార్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది. అందులో భాగంగా జిల్లాలో 28 బార్లకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నెల 26లోగా దరఖాస్తులు స్వీకరించి డిపాజిట్లు సైతం చెల్లించాలని చెప్పింది. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బార్ పాలసీ ఉంది. మద్యం దుకాణాల (మిగతా 8వ పేజీలో..)



ఆధ్యాత్మికం.. పర్యావరణ హితం

- మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న వైనం
- సామాజిక సేవకుల ఉదారత

వినాయక ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించడమే కాదు.. పర్యావరణాన్నీ పట్టించుకోవాలని సూచిస్తున్నారు కొంతమంది వ్యక్తులు. అందులో భాగంగా ఓ అడుగు ముందుకేసి.. తామే చొరవ చూపి... మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై ర్యాలీలు నిర్వహిస్తూ.. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

సామాజిక బాధ్యతగా పదివేల విగ్రహాలు



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి, రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రాజాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): 'మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో ముందుకు సాగుతోంది పర్యావరణ పరిరక్షణ సమితి. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను వారం రోజులుగా ప్రజలకు ఉచితంగా అందిస్తోంది. పర్యావరణ హితం కోసం ఈ మహోన్నత కార్యకార్యక్రమాన్ని చేపడుతున్నామని పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధులు, రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆర్‌వీజే నాయుడు, కొత్త సాయిప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్, గట్టి పాపారావు, బీవీ అచ్యుత్‌కుమార్ తెలిపారు. పదివేల వరకు విగ్రహాలను ఇప్పటి వరకు రాజాం పట్టణంలో అందజేశామన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తయారు చేసే విగ్రహాలతో పర్యావరణానికి పెనుముప్పు అని, అందుకే మట్టి విగ్రహాలను అందిస్తున్నట్లు తెలిపారు.

మట్టి గణపతి కేరాఫ్ ఏలాం జంక్షన్

- 46 ఏళ్లుగా ఏర్పాటు చేస్తున్న ఉత్సవ కమిటీ



ఏలాం సెంటర్‌లో తయారు చేస్తున్న 18 అడుగుల వినాయకుడి విగ్రహం

పాలకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏలాం జంక్షన్‌లో మట్టి వినాయక విగ్రహాన్ని ఉత్సవ కమిటీ నిర్వాహకులు పల్లా కొండలరావు ఏర్పాటు చేస్తున్నారు. తన తండ్రి పల్లా బాబ్జీ ఆధ్వర్యంలో గతంలో 15 అడుగుల విగ్రహాన్ని మట్టితో తయారు చేసి ఉత్సవాలు నిర్వహించేవారు. పశ్చిమబెంగాల్ నుంచి మట్టితో తయారు చేసే వారిని 15 రోజుల ముందుగా తీసుకుని వచ్చి వినాయకుని విగ్రహాన్ని తయారు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మొదట్లో 9 అడుగులు నుంచి ప్రారంభమైన ఈ విగ్రహం ఇప్పుడు 18 అడుగులకు పెరిగింది. ప్రతిఏటా విభిన్న ఆకృతిలో గణనాథుడిని రూపొందించి నవరా త్రులు అంగరంగ వైభవంగా జరుపుతుంటారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా సిద్ధి, బుద్ధితో కూడిన విగ్రహాలను పీఠంపై కళాకారులు రూపొందిస్తున్నారు.

74 ఏళ్లు నుంచివిక్రయిస్తున్నాం



నాకు తెలిసి 74 ఏళ్ల నుంచి మట్టి విగ్రహాలనే విక్రయిస్తున్నాం. 16 ఏళ్ల మట్టి వినాయకులను తయారు చేస్తున్నాను. ఇప్పుడు 90 ఏళ్లు పైబడింది. ప్రస్తుతం నా కొడుకులు, కోడళ్లు మట్టి విగ్రహాలనే తయారు చేస్తున్నారు.

- దేవారపు సత్యం, చినకుమ్మరి వీధి, సాలూరు

అక్కడ ప్రతిఏటా మట్టి విగ్రహాలే



సీతానగరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు మొదటి దేవుడంటే విఘ్నాలకు అధిపతి వినాయకుడని భావిస్తారు. ఈ నెల 27వ తేదీ వినాయక చవితి కావడంతో మండలంలో వినాయక ఉత్సవ కమిటీలు, విద్యార్థులు, యువకుల్లో హడావిడి మొదలైంది. మండల కేంద్రంలో వెలమవారివీధి, గూడెంవీధి, పెదభోగిలి, బూర్జ, నిడగల్లు, గాదెలవలస గ్రామాల్లో ఎన్నో సంవత్సరాలుగా మట్టి వినాయకుడిని పెట్టడం ఆనవాయితీ వస్తోంది. ఈ ఏడాది కూడా మట్టి విగ్రహాలు పెడుతున్నట్లు ఆ కమిటీలు తెలిపాయి.

మట్టి విగ్రహాలకు ఆర్డర్లు వస్తున్నాయి

సీతానగరంలోని కుమ్మరివీధిలో కొంతమంది మట్టి విగ్రహాల తయారీ కులవృత్తిగా చేసుకున్నారు. తరతరాలుగా వీటిని తయారుచేస్తున్నారు. వీటికి నెల రోజులుగా ఆర్డర్లు వస్తున్నాయని వారు తెలిపారు. వరి పొట్టు, వరి గడ్డి, బూడిద, కొబ్బరి పీచు, రంగుల ధరలు పెరగడంతో విగ్రహాల తయారీ భారంగా మారిందని చెబుతున్నారు.

ఆర్డర్లు తీసుకొని తయారీ



20 ఏళ్ల నుంచి మట్టి వినాయకులను తయారు చేసి విక్రయిస్తున్నాను. రంగులు, మట్టి ధర పెరిగినా గణనాథులను తయారు చేస్తున్నాను. సాలూరుతో పాటు పలు గ్రామాల ప్రజలు విగ్రహాలు తీసుకెళ్లతారు. ప్రస్తుతం వివిధ గ్రామాల నుంచి ఆర్డర్లు తీసుకొని మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాను. వాటికి మెటలిక్ రంగులు వినియోగించడం వల్ల ఆకర్షణీయంగా ఉంటాయి.

- దేవారపు పంచముఖేశ్వరరావు, చినకుమ్మరి వీధి, సాలూరు

పర్యావరణ పరిరక్షణ కోసమే



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న జగదీష్

పూసపాటిరేగ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మండలంలోని కొత్తకొప్పెర్ల గ్రామానికి చెందిన దేవగుప్తాపు జగదీష్ గత ఆరేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన ప్రతిమలు పర్యావరణానికి కీడు తలపెడుతున్నాయని, పురాణాల్లో కూడా మట్టి విగ్రహాలను తయారుచేసి పూజించాలనే సూచించారని ఆయన తెలిపారు. దీనిపై అవగాహన కల్పించి ప్రతిఏటా గ్రామంలో అన్ని కుటుంబాలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ఈ కారణంగా వినాయక చవితినాడు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినాయోగాన్ని తగ్గించగలిగామని, అదే తనకు సంతృప్తిని ఇస్తున్న అంశమని ఆయన తెలిపారు. ఈఏడాది కూడా ఎప్పటిలాగే పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

సవాల్‌గా తీసుకుంటాం



మట్టి గణపతులు తయారీ సవాల్‌గా తీసుకుంటాం. సాలూరు,సమీప ఒడిశాకు మా విగ్రహాలు వెళ్తాయి. ఈ ప్రాంతంలో ఆది నుంచి మట్టి విగ్రహాలే ప్రతిష్ఠించి ఉత్సవాలు చేస్తారు. గడ్డి, జనపనార సంచులు, మట్టితో విగ్రహాలను తయారు చేసి వాటర్,మెటలిక్ కలర్స్ వినియోగిస్తాం. సాలూరులో 11కుటుంబాలు మట్టి విగ్రహాలే తయారు చేస్తున్నాయి.

- డి.సన్నిబాబు, సాలూరు

వెయ్యి విగ్రహాల పంపిణీ

రాజాం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతే మహా గణపతి అని ప్రముఖ వైద్యులు డా.సామంతుల కిరణ్‌కుమార్, డా.బొమ్మిడాల కృష్ణారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తమరావు అన్నారు. డోలపేటలోని జీఎంఆర్ నగర్‌లో రాజాం మార్ట్ యజమాని కడగల నాగరాజు సమకూర్చిన వెయ్యి మట్టిగణపతి విగ్రహాలను సోమవారం వారు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో శాసపు రమేష్ కుమార్, టీటీవీ రమణమూర్తి, వాకచర్ల పైడిరాజు, కొత్తా సాయిప్రశాంత్ కుమార్, టంకాల కన్నంనాయుడు తదితరులున్నారు.



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎస్.కోటలో 2500 విగ్రహాలు

శృంగవరపుకోట ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛందసంస్థ పదేళ్ల నుంచి మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణి చేస్తోంది. ప్రతిఏటా 2000 నుంచి 2500 ప్రతిమలను అందిస్తోంది. మట్టి ప్రతిమలు నీటిలో త్వరగా కరిగిపోతాయని, ఆనీటిని వాడే పొలాలకు ఎలాంటి నష్టం ఉండదని చెబుతోంది. ఎస్.కోటతో పాటు వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, జామి మండలాల్లో వీటిని అందిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు బొబ్బిలి రామకష్ణ, వై.విజయలక్ష్మి తెలిపారు.



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న జీయో సంస్థ ప్రతినిధులు



రేగిడి: ఎరువు కోసం సంకిలిలో గుమిగూడిన రైతులు

యూరియా కోసం రైతుల బారులు

- సరిపడా సరఫరా లేదంటున్నరైతులు
- రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు

లక్కవరపుకోట/రేగిడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు కష్టాలు పడుతున్నారు. సోమవారం రేగ, లచ్చింపేట రైతు సేవా కేంద్రాలకు 260 బస్తాలు యూరియా వచ్చింది. దీనిని పది గ్రామాలకు సర్దుకోవాలంటే ఎలాగని రైతులు మండిపడుతున్నారు. దీంతో సమాధానం చెప్పలేక వ్యవసాయాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏవో హరికృష్ణను వివరణ కోరగా యూరియా కొరత ఉందని, మరో రెండు రోజుల్లో వస్తుందని తెలిపారు. 600 టన్నుల యూరియా అవసరం కాగా 216 టన్నులు మాత్రమే వచ్చిందన్నారు. 80 టన్నుల డీఏపీ అవసరం కాగా 44 టన్నులు వచ్చిందన్నారు.

- వర్షం పడుతున్నా లెక్కచేయకుండా రేగిడి మండలం సంకిలి రైతు సేవాకేంద్రం వద్ద ఎరువుల కోసం రైతులు ఎగబడ్డారు. రైతుల తాకిడి తట్టుకోలేక సిబ్బంది అర్థాంతరంగా పంపిణీని నిలిపివేశారు. దీంతో దీని పరిధిలో ఉన్న సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట, అప్పాపురం, మజ్జిరామునిపేట గ్రామాలు రైతులు నిరాశతో వెనుతిరిగారు. ఈ కేంద్రానికి గతంలో ఒకసారి 400 బస్తాల యురియా వచ్చింది. తాజగా మరో 225 బస్తాలు రాగా.. ఒక్కో రైతుకు ఒక బస్తా కూడా ఇవ్వలేని పరిస్థితి. సోమవారం ఐదు గ్రామాల రైతులు భారీగా రావడంతో కేంద్రం వద్ద గందరగోళం నెలకొంది. సిబ్బంది వారిని కంట్రోల్ చేయలేక పంపిణీకి నిలిపివేశారు. దీంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు. ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్య తమ దృష్టికి వచ్చిందని, మరో లోడు పంపించి సరఫరా చేస్తామని తెలిపారు.

వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

- బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలతో పాటు నిబంధనలు పాటించాలని బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి కోరారు. సోమవారం బొబ్బిలిలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఎన్‌వోసీలను సంబంధిత శాఖల నుంచి తీసుకోవాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ, ట్రాన్స్‌కో నుంచి ధ్రువపత్రాలను తీసుకోవాలని కోరారు. భక్తుల రద్దీని నియంత్రించడంలో కమిటీలు బాధ్యతాయుతంగా మెలగాలని తెలిపారు. నిమజ్జనం కోసం నిర్వహించే ఊరేగింపులో ఎటువంటి అపశ్రుతి జరగకుండా వలంటీర్లు పనిచేయాలని పేర్కొన్నారు. రూట్‌మ్యాప్ ప్రకారం ఊరేగింపు సాగాలని, అసభ్యకరమైన, అశ్లీల కార్యక్రమాలకు తావు లేదని, వాటిని పూర్తిగా నిషేధించామని తెలిపారు. శబ్దకాలుష్యానికి అవకాశం లేకుండా క్రమశిక్షణాయుతంగా, బాధ్యతగా భక్తిభావాన్ని పెంపొందించే విధంగా ఉత్సవాలను విజయవంతం చేసుకోవాలని కోరారు. మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని భవ్యారెడ్డి హెచ్చరించారు.

స్త్రీ శక్తి పథకానికి అనూహ్య స్పందన



వరలక్ష్మి, డీపీటీవో, విజయనగరం

విజయనగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన స్త్రీ శక్తి పథకానికి జిల్లాలో అనూహ్య స్పందన లభిస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారిణి జి.వరలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విజయనగరంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 15 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని, నాలుగు రకాల బస్సుల్లో మొత్తం 6,17,206 మంది ప్రయాణించగా, ఇందులో 3,26,939 మహిళలకు ఉచిత ప్రయాణం చేసినట్లు ఆమె చెప్పారు. టికెట్లు తీసుకుని ప్రయాణించిన పురుషులు 2,90,499 మంది ఉన్నారని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు. పదో రోజుల్లోనే మహిళా ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా 60 శాతం పెరిగిందన్నారు. ప్రయాణికులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేశామని, అలాగే బస్సులకు ఫిట్‌నెస్ నిర్వహించి అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.



దేవస్థానం ప్రాంగణంలో సేవలో పాల్గొన్న శ్రీవారి సేవకులు

తోటపల్లిలో శ్రీవారి సేవకులు

- ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీచేస్తున్న దేవస్థానం ట్రస్ట్ ప్రతినిధులు

గరుగుబిల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో భక్తులకు సేవలందించేందుకు శ్రీవారి సేవకులు ముందుకొస్తున్నారు. ప్రస్తుతం దేవస్థానాన్ని పునర్నిర్మాణం తర్వాత ప్రత్యేక సేవలు అందజేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే తోటపల్లిలో సేవలు అందించేందుకు పరిసర ప్రాంతాలతో పాటు తోటపల్లికి చెందిన సేవకులు సుమారు 100 మందికి పైగా అందుబాటులో ఉంటున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల, అన్నసమారాధనకు సంబంధించి సామూహికంగా సేవల్లో పాల్గొంటున్నారు. శ్రీవారి సేవకులకు అవసరమైన గుర్తింపు కార్డులను దేవస్థానం అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు జారీ చేస్తున్నారు. ఆసక్తి గల వారు సేవల్లో పాల్గొనవచ్చునని ప్రతినిధులు తెలిపారు.

నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం

- డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నేత్రదానం అన్ని దానాల్లో గొప్ప దానమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఎస్.జీవనరాణి అన్నారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించి కరపత్రాలు, పోస్టర్ ఆవిష్క రించారు. ఈసందర్భంగా ప్రోగ్రాం అధికారి డా.కె.త్రినాథ్ మాట్లాడుతూ నేత్రదానానికి ముందుకు వచ్చే వ్యక్తులు 90143 27168, 94408 21919, 92466 24000 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. వైద్యులు కె.రాణి, మురళి పాల్గొన్నారు.

రాజాంలో విజిలెన్స్ దాడులు

- రూ.16 లక్షల విలువచేసే ఎరువులు సీజ్



ఆంజనేయ ట్రేడర్స్‌లో దాడులు నిర్వహిస్తున్న అధికారులు

రాజాం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయ ట్రేడర్స్‌లో విజిలెన్స్, పోలీస్, వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. రికార్డుల్లోని నిల్వలతో స్టాక్‌ను సరిపోల్చారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎరువులను అధిక ధరలకు విక్రయించినట్లు, బిల్లుల్లో స్పష్టమైన తేడాలున్నట్లు అధికారులు గుర్తించారు. రూ.16 లక్షల విలువచేసే ఎరువులను సీజ్ చేశారు. డీలర్‌పై కేసు నమోదు చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, బ్లాక్ చేసినా, బిల్లులేకుండా సరఫరా చేసినా చర్యలు తప్పవని రాజాం ఏడీఏ చంద్రరావు హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, రాజాం ఎస్ఐ రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



విరబూసిన బ్రహ్మ కమలాలు

గరుగుబిల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగూరులో బ్రహ్మ కమలాలు విరబూశాయి. గ్రామానికి చెందిన పల్ల పరిశినాయుడు, రోహిణికుమార్‌ల ఇంటి ఆవరణలో బ్రహ్మ కమలాలు వికసించడంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. తోటపల్లి, నాగూరు గ్రామాల్లోనే బ్రహ్మ కమలాలు వికసించాయి.

← నాగూరులో వికసించిన బ్రహ్మ కమలాలు

ఉద్యోగాలు సాధించిన వారికి మంత్రి అభినందనలు

గజపతినగరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో కెంగువ గ్రామానికి చెందిన ఆరుగురు ఉద్యోగాలు సాధించడంతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం వారికి అభినందనలు తెలిపారు. తాను దత్తత తీసుకున్న గ్రామం నుంచి మజ్జి బార్గవి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించగా, మిత్తిరెడ్డి అప్పలనాయుడు 4వ ర్యాంకు, కృష్ణవేణి 22వ ర్యాంకు, బండారు ఈశ్వరరావు 37వ ర్యాంకు, గుడివాడ సత్యారావు, 115వ ర్యాంకు, సౌబాగ్యలక్ష్మి 119వ ర్యాంకు సాధించి వివిధ విభాగాల్లో ఉద్యోగాలకు అర్హత సాధించడం అభినందనీయం అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగు నింపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

రాజాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించిందని, వైసీపీ తప్పుడు ప్రచారం మానుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మెగా డీఎస్సీని ఆపడానికి వైసీపీ నాయకులు 24 కేసులు పెట్టారని, అవన్నీ తట్టుకుని మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత లోకేశ్‌కు దక్కుతుందన్నారు. నీతి అయోగ్ నివేదిక ప్రకారం నాణ్యమైన విద్యలో మూడో స్థానం నుంచి 19వ స్థానానికి దిగజార్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

మెగా డీఎస్సీ ఘనత లోకేశ్‌దే..

లక్కవరపుకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మెగా డీఎస్సీ నిర్వహించి, నిరుద్యోగుల కళ్లల్లో ఆనందం నింపారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. లోకేశ్ 16వేల 347 ఉపాధ్యాయ పోస్టులు పారదర్శకంగా నిర్వహించి, నిరుద్యోగుల పాలిట దేవుడిలా నిలిచారని అన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

రాజాం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ పిలుపునిచ్చారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్(1979-89) ఆధ్వర్యంలో రూ.4లక్షల వ్యయంతో నిర్మించిన మైత్రీ వేదికను ఆయన సోమవారం ప్రారంభించారు. ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తా సాయిప్రశాంత్ కుమార్, బీవీ అచ్యుతకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

భోగాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం నాతవలసకు చెందిన పిట్ట రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న నేపథ్యంలో సీఎం సహాయ నిధి మంజూరయ్యింది. ఆమెకు మంజూరైన రూ.లక్షా 20వేల 701 విలువ గల చెక్కును రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సోమవారం పోలిపల్లి గ్రామంలో బాధిత మహిళకు అందజేశారు.

నేడు ఘంటసాల సినీ సంగీత విభావరి

విజయనగరం కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.భీష్మారావు తెలిపారు. స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో ఎం.భీష్మారావు సారథ్యంలో సాయి-పవన్ సంగీత నిర్వహణ లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు.

కళా సోదరుడు నీలంనాయుడు మృతి

రేగిడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చీపురపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆరో సోదరుడు కిమిడి నీలంనాయుడు(75) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కళాతో పాటు ఇతర సోదరులు రేగిడి చేరుకున్నారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పైడిరాజు ప్రతిభ

నెల్లిమర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కొండగుంపాం గ్రామానికి చెందిన ఎస్.పైడిరాజు ప్రతిభ కనబరిచారు. 40-50 సంవత్సరాల వయస్సు విభాగంలో సీనియర్ హ్యాండ్ బ్యాలెన్స్, ట్విస్ట్ బాడీ ఇండివిడ్యువల్ విభాగాల్లో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచి.. స్వర్ణ, కాంస్య పతకాలు సాధించారు. ఆగస్టు 21 నుంచి 24 వరకు తాడేపల్లిగూడెం ప్రత్తిపాడులో జరిగిన ఈ పోటీల్లో ఆయన విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

స్వీయ రక్షణపై శిక్షణ

గరివిడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో ఏక్టివ్ టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు మహిళల స్వీయ రక్షణ-సెల్ఫ్ డిఫెన్స్ అనే అంశంపై సోమవారం గరివిడి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో పి.రామారావు, డి.అప్పన్న, హెచ్ఎం ఎం.నిర్మల, గరివిడి ఎస్ఐ లోకేశ్వర రావులు బాలికలకు అవగాహన కల్పించారు. ● గుర్ల: గుర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యం లో విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలానికి చెందిన 12 మంది పీఈటీలు పాల్గొన్నారు. బాలికలకు ఆత్మ రక్షణపై శిక్షణ ఇచ్చారు.

ప్రమాదకర ప్రయాణం

- కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

భోగాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. ఏ బస్సు చూసినా కిటకిటలాడుతూ కనిపిస్తోంది. అయితే భోగాపురం, చుట్టు పక్కల గ్రామాల నుంచి విజయనగరం, పూసపాటిరేగ, తగరపువలస, విశాఖపట్నం రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. కళాశాలల కు సమయానుకూలంగా హాజరు కావాలనే ఉద్దేశంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. బస్సుల్లో ఖాళీ లేకపోయినా ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తు న్నారు. ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు స్పందించి కనీసం ఉదయం పూటయినా బస్సుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఫుట్‌బోర్డుపై వేలాడుతున్న విద్యార్థులు

మెంటాడను మన్యంలో కలపొద్దు

- కలెక్టర్‌కు జేఏసీ నాయకుల వినతి

విజయనగరం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మెంటాడ మండలాన్ని ఎప్పటిలాగే విజయనగరం జిల్లాలో కొనసాగించాలని, మన్యం జిల్లాలో కలపొద్దని విజ్ఞప్తి చేస్తూ ఆ మండల జేఏసీ నాయకులు కలెక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను కోరారు. ఈ మేరకు సో మవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. మెంటాడను మన్యంజిల్లాలో కలుపుతార ని ఎవరు చెప్పారంటూ ఎదురు ప్రశ్నించారు. అటువంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, సభ్యులు గెద్ద అన్నవరం, రెడ్డి సన్యాసినాయుడు, రాయపల్లి రామారావు, లెంక రత్నాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి: ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసుస్టేషన్ల పరిధిలో ఫిర్యాదుదారులకు న్యాయం చేసేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 36 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫిర్యాదులపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 11, కుటుంబ కలహాలకు సంబంధించి 8, మోసాలకు పాల్పడినట్టు 5, ఇతర అంశాలకు సంబంధించి 12 ఫిర్యాదులు ఉన్నాయి. ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐ లీలారావు, డీసీఆర్‌బీ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ పీజీఆర్ఎస్‌కు ఒకే వినతి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక వినతి వచ్చింది. ఇంజనీరింగు విభాగానికి సంబంధించి కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేయాలని పలువురు కమిషనర్ నల్లనయ్యకు వినతిపత్రం అందజేశారు.

మా గ్రామాలను పార్వతీపురంలో విలీనం చేయాలి

వంగర, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవీఆర్ పేట, జేకే గుమ్మడ గ్రామాలను పార్వతీపురం లో జిల్లాలో విలీనం చేయాలని పార్వతీపురం, విజయ నగరం కలెక్టర్లను ఆయా గ్రామస్థులు కోరారు. ఈసంద ర్భంగా సోమవారం వారు ఇరు కలెక్టర్ల వద్దకు వెళ్లి, వినతిపత్రం అందజేశారు. అలాగే తమ గ్రామాలను సమీపంలో ఉన్న గరుగుబిల్లి మండలంలో విలీనం చేయాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటా మని కలెక్టర్లు తెలిపారు.

ఏయూ రిజిస్ట్రార్ రాజీనామా!

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు రాజీనామా చేశారు. తనను బాధ్యతల రిలీవ్ చేయాలని ఆయన సోమవారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌ను కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రొఫెసర్ ధనుంజయరావు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. అయితే, అనూహ్యంగా ఇప్పుడు తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. రిజిస్ట్రార్‌గా ఏడాదిపాటు అందించిన సేవలు తనకు సంతృప్తిని కలిగించాయని, ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ఏయూకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రిజిస్ట్రార్ నిర్ణయం వర్సిటీలో కలకలం రేపింది. అందుకు గల కారణాలు ఏమై ఉంటాయా? అన్న చర్చ జరుగుతోంది. అయితే, ఈ నిర్ణయం వెనుక బలమైన కారణాలు ఉన్నట్టు చెబుతున్నారు. గడిచిన కొన్నాళ్లుగా వీసీ, రిజిస్ట్రార్ మధ్య దూరం పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు. ప్రధానంగా కొన్ని కీలక నిర్ణయాల్లో రిజిస్ట్రార్‌కు వీసీ భాగస్వామ్యం కల్పించడం లేదని చెబుతున్నారు. కొన్నాళ్ల కిందట డీన్లు, డైరెక్టర్లు, ఇతర పదవుల నియామకాన్ని వీసీ చేపట్టారు. అయితే, వారిని నియమించే క్రమంలో కనీసం రిజిస్ట్రార్‌గా ఉన్న ధనుంజయరావును వీసీ సంప్రతించలేదని తెలిసింది. అలాగే శతాబ్ది ఉత్సవాలకు గవర్నర్‌ను ఆహ్వానించేందుకు కూడా వీసీ ఒక్కరే వెళ్లిపోయారు. ఈ తరహా ఆహ్వానాలను అందించేప్పుడు సాధారణంగా వీసీ వెంట రిజిస్ట్రార్ ఉంటారు. వీటితోపాటు అనేక కీలక నిర్ణయాల్లోనూ ఇద్దరి మధ్య దూరం పెరిగిందని, అదే తాజా నిర్ణయానికి కారణంగా పేర్కొంటున్నారు. ఇదిలావుండగా రాజీనామాపై రిజిస్ట్రార్‌తో మాట్లాడేందుకు యత్నించగా ఆయన అందుబాటులో లేరు.

కుష్ఠు రోగులకు విద్యార్థుల సాయం

గుర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వి.చింతల పేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుష్ఠు రోగులకు రూ.5299 విరాళం గా అందించారు. ఈ మొత్తాన్ని లెప్రసీ సొసైటీ ప్రెసైడింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు హెచ్ఎం గౌరీదేవి సోమవారం అందజే శారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

శృంగవరపుకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులతో సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పడుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం ఎస్.కోట పట్టణంలో లబ్ధిదారులకు ఆమె స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, పార్టీ మండల అధ్యక్షుడు జీఎస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ● లక్కవరపుకోట: స్థానిక కోమటివీధిలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే లలితకుమారి సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సీఎస్‌డీటీ ఇందిర, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● రేగిడి: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన అజెండా అని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహనరావు అన్నారు. సోమవారం అంబఖండి గ్రామంలో ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు దూబ ధర్మారావు, అంబళ్ల సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


శృంగవరపుకోట: స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఎరువుల దుకాణాల తనిఖీ

భోగాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాపురం, పోలిపల్లి సొసైటీల్లో ఎరువుల దుకాణాలను తహసీల్దార్ రమణమ్మ, వ్యవసాయ అధికారి హైమావతి సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. ఎరువుల అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే 6ఏ కేసులు నమోదు చేసి, అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ సూర్యకుమారి, ఏఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

● లక్కవరపుకోట: మండలంలోని ఎల్‌కేఎస్ పురం, గొల్జాం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను, రైతు సేవా కేంద్రాలను రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఎరువులు పక్కదారి పట్టినా, అధిక ధరకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, ఎస్ఐ నవీన్ పడాల్, సీఎస్‌డీటీ ఇందిర పాల్గొన్నారు. ● గజపతినగరం: స్థానిక శ్రీసత్య ట్రేడర్స్‌తో పాటు రైతు సేవా కేంద్రంలో సోమవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, డీటీ శోభ, ఏవో కిరణ్‌కుమార్‌లు తనిఖీలు చేపట్టారు. నానో యూరియా, డీఏపీ స్టాక్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. యూరియాతో పాటు గుళికలు అంటగడుతున్నట్టు రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటును అడ్డుకున్న గిరిజనులు

కొత్తవలస, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అప్పన్నదొర పాలెంలో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలోని దారపైడితల్లమ్మ ఆలయానికి గాను సోమవారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండగా గిరిజనులు అడ్డుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు అదనపు బలగాలతో చేరుకుని, పలువురు గిరిజనులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆలయానికి ఆనుకుని సుమారు 100 ఎకరాల భూముల విషయంలో సంబంధిత వ్యక్తులకు, స్థానిక గిరిజనులకు మధ్య వివాదాలు ఉన్నాయి. ఆలయానికి విద్యుత్ సౌకర్యం పేరుతో వివాదంలో ఉన్న భూములకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారని, ఈ భూములను అన్యాక్రాంతం చేసుకోవడానికే పథకం ప్రకారం ముందుగా ఆలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుందని వారు ఆరోపించారు.

జిందాల్ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

ఎస్.కోట రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బొడ్డవర గ్రామంలో నిరసన చేపట్టారు. తాము 65 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వాలు, అధికారులు స్పందించకపోవడం బాధాకరం అన్నారు. వీరికి మద్దతుగా ఎంపీపీ సోమేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ


నెల్లిమర్ల: మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు


భోగాపురం: మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి


విజయనగరం టౌన్: మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక ప్రతిమల వినియోగంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రామతీర్థం సేవా సంఘం అధ్యక్షుడు ఆల్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్‌లో సోమవారం నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మరో అతిథి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుతో కలిసి ఆయన విగ్రహాలను పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు ఆల్తి శ్రీనివాసరావు, రేగాన గోవిందరావులను వారు అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, లంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● విజయనగరం టౌన్: మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే వినియోగించాలని వాసవి క్లబ్ జిల్లా కేబినెట్ సెక్రటరీ(అడ్మిన్) ఆలవెల్లి శేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం రామతీర్థం దేవస్థానం వద్ద భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు విజ్జపు విజయ్‌కుమార్, ప్రాజెక్టు చైర్మన్‌లు పాల్గొన్నారు.

● భోగాపురం: ప్రతిఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సోమవారం భోగాపురం హనుమాన్ జంక్షన్‌లో జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు ఆధ్వర్యంలో ఆమె మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు బొల్లు త్రినాథ్, మాతా నవీన్, గుండపు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు. ● భోగాపురంలో సాయిదుర్గా హెచ్‌పీ గ్యాస్ గ్రామీణ వితరక్ ఆధ్వర్యంలో నిర్వాహకురాలు దేవపుష్పలత సోమవారం రెండు వేల మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.

● విజయనగరం దాసన్నపేట: నగరంలోని కోట జంక్షన్‌లో జిల్లా హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అలాగే ఆర్అండ్‌బీ జంక్షన్, రైతుబజారు వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రతినిధులు వై.బాబురావు, వాసు, సునీల్, చైతన్య, రెడ్‌మిర్చి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తవలస, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవలస-కంటకాపల్లి రైల్వేస్టేషన్ల మధ్యనున్న రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్టు విజయనగరం జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాల లోపు ఉంటుందన్నారు. ఎరుపు రంగు ఫుల్‌హ్యాండ్ టీ షర్టు, గ్రే కలర్ లోయల్, బ్లూకలర్ ప్యాంటు ధరించి ఉన్నట్టు చెప్పారు. మృతుడు రైలులో నుంచి జారి పడిపోయాడా.. రైలు కిందపడి మృతిచెందాడా.. అనే విషయాలు తెలియరాలేదన్నారు. పోస్టుమార్టం కోసం తరలించామన్నారు. వివరాల కోసం విజయనగరం జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని ఒకరు..

కొత్తవలస, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాడ పంచాయతీ కోనమశివానిపాలెం గ్రామానికి చెందిన కోన అప్పలనాయుడు(58) రైలు ఢీకొని సోమవారం మృతిచెందాడు. రైల్వేలో కాంట్రాక్టర్ వద్ద రోజువారీ కూలీగా పని చేస్తున్న అప్పలనాయుడు ప్రతిరోజూ కోనమశివానిపాలెం నుంచి విశాఖపట్టణం వెళ్తుంటాడు. సోమవారం ఉదయం కొత్తవలస నుంచి బయదేరి వెళ్లిన అప్పలనాయుడు దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలపై పనిచేస్తుండగా.. తన వైపు వస్తున్న రైలును గమనించలేదు. రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, నర్సింగరావు అనే కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

రాజాం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో విద్యుదాఘాతంతో అదే గ్రామానికి చెందిన మురళి(35) అనే వ్యక్తి మృతిచెందాడు. గ్రామంలో టీ షాప్‌లో పని కోసం వెళ్లిన ఆయన విద్యుత్ తీగను తాకడంతో ప్రమాదం సంభవించింది. వెంటనే రాజాం సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.22 లక్షల చీటీ సొమ్ము గోల్‌మాల్

భోగాపురం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): చీటీల నిర్వాహకుడు చీటీలు, అప్పులు రూపంలో సుమారు రూ.22లక్షలు తీసుకుని ఇవ్వడం లేదంటూ భోగాపురం పంచాయతీ సిమ్మపేటకు చెందిన మహిళలు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. కొల్లు రమణమ్మ, కొల్లు ఎంకయ్యమ్మ, సూరమ్మ, తదితరులు చెప్పిన వివరాల ప్రకారం.. బతుకు తెరువు కోసం వచ్చి సిమ్మపేటలో నివాసం ఉంటున్న చిన్ని రామ్‌కోటి అనే వ్యక్తి నమ్మకంగా ఉంటూ చీటీలు నిర్వహించేవాడన్నారు. కొంతమంది అప్పులు కూడా ఇచ్చామని చెప్పారు. అందరివీ కలిపి సుమారు రూ.22లక్షలు ఉంటుందన్నారు. ఇటీవల ఆ సొమ్ము ఇవ్వాలని అడిగితే తిరిగి తమ మీదే పోలీసులకు ఫిర్యాదు చేశాడని చెప్పారు. తమ సొమ్ము తమకు ఇప్పించే విధంగా చర్యలు తీసుకో వాలని బాధిత మహిళలు కోరారు. దీనిపై ఎస్ఐ వి.పాపారావును వివరణ కోరగా.. తగువు పెద్దల సమక్షంలో ఉందని, న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మరో ఇద్దరు దొంగలు చిక్కారు

బొండపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మరువాడలో జరిగిన దొంగతనాల్లో మరో ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. వీరిని సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల ముందు హాజరు పరిచారు. దీనికి సంబంధించి గజపతినగరం సీఐ జీఏవీ రమణ, ఎస్ఐ యు.మహేష్, ట్రైనీ ఎస్ఐ సాయిరాంపడాల్ వివరాలు వెల్లడించారు. ఇటీవల మోటార్లు, బోరుబావుల మోటార్లు, ఇంధన ఇంజన్లతోపాటు మేకలు, గొర్రెలు, కోళ్ల దొంతనాలకు గురవుతున్నాయని పలు ఫిర్యాదులు అందాయని తెలిపారు. దీంతో పలు గ్రామాల్లో గాలించి.. కొండకెరడాం, వెధురవాడ, కొత్తపాలెం గ్రామాలకు చెందిన నలుగురు నిందితులను పట్టుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

గజపతినగరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వరుస చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జీఏవీ రమణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన గ్రంధి హరిశంకర్ ఓ బాలుడితో కలిసి మార్కెట్ యార్డులో చోరీకి పాల్పడ్డారని చెప్పారు. కిరాణా షాపుల్లో చోరీకి పాల్పడి నగదు కాజేశారన్నారు. వీరిపై రెండు రోజులుగా ప్రత్యేక నిఘా పెట్టి పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.14వేలు రికవరీ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

కొట్లాటపై కేసు నమోదు

భోగాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చినకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు తనను కొట్టారని ముక్కాం గ్రామానికి చెందిన వాసపల్లి అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ దుర్గాప్రసాద్‌రావు సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పలరాజు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 24న ముక్కాం ఆటోస్టాండ్ వద్ద ఉన్న అప్పలరాజుపై చినకొండ్రాజుపాలెంకు చెందిన కేశం శ్రీరాం, కేశం రాజు, కేశం లక్ష్మణ, కేశం రాకేష్ అనే నలుగురు దాడి చేశారు. గాయాలపాలైన ఆయన్ని ఆటో డ్రైవర్లు సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కేసు పంపిస్తా.. కమీషన్ కొట్టు

(ఐదో పేజీ తరువాయి)

పిండుకొని తమ వద్దకు పంపిస్తున్న వారికి కమీషన్లు ముట్టజెబుతున్నారు. జిల్లాలో 300కుపైగా ఆస్పత్రులు ఉన్నాయి. దాదాపు చాలా ఆస్పత్రుల్లో ఇలా పీఎంపీలు, ఆర్ఎంపీలు సిఫారసు చేసిన కేసులే వస్తుంటాయి. ఓపీ, ఐపీ, రోగికి ఆస్పత్రికి అయ్యే బిల్లులో 20 నుంచి 30 శాతం కమీషన్ల రూపంలో వెళుతోంది. దీంతో రోగికి అవసరమైన వైద్యం అందించే నిపుణుల వద్దకు కాకుండా కమీషన్లు అందించేవారి వద్దకు పంపి కాసులు దండుకుంటున్నారు. దీంతో ఖర్చు పెరుగుతుండగా.. రోగానికి తగ్గ వైద్యం అందక ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు.

ఓపీ ధర చూస్తుంటే బీపీ..

కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ ధరల సూచిక బోర్డులు కనిపించడం లేదు.అటు వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలేదు.దీంతో ఓపీ ధరను పెంచి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఓపీ టిక్కెట్ ధర రూ. 100 లేదా రూ.200 ఉండేది. సామాన్యులకు కొంత అందుబాటులో ఉండేది. కొవిడ్ తరువాత పరిస్థితి మారిపోయింది. రూ.500 వరకూ పెంచేశారు. అత్యవసర విభాగాలకు సంబంధించి ఓపీ అయితే రూ.700 నుంచి గరిష్ఠంగా రూ.1000 వరకూ పెంచేశారని రోగుల బంధువులు తెలిపారు. సాధారణ ఐసీయూ గది రోజుకు రూ.4000నుంచి రూ.7000 వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఆస్పత్రిలో ఉండే రోగులకు ఉదయం, సాయంత్రం రౌండ్స్‌లో తనిఖీ చేస్తున్నందుకు డాక్టరు ఫీజు రూ.2000 వరకూ వసూలు చేస్తున్నారు. సామాన్యుడు ఏదైన అనారోగ్య సమస్యతో ఆస్పత్రిలో చేరితే ఇల్లు గుల్ల కావాల్సిందే. కొందరు ప్రైవేటు వైద్యులు, ఆస్పత్రుల యాజమాన్యాలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

● ముఖ్యంగా అవుట్ పేషెంట్ (ఓపీ) కార్డుల ధరలు చూస్తే రోగులకు బీపీ వచ్చినంత పని అవుతోంది. జాతీయ వైద్యమండలి నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టారీతిన వసూలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు సాయం అవుతారనుకుంటే వారు కమీషన్ల రూపంలో దండుకుంటున్నారు.

వారం రోజులకు తగ్గిన కాల పరిమితి..

గతంలో అవుట్ పేషెంట్ (ఓపీ) టోకెన్ కాలపరిమితి 15 రోజుల వరకూ ఉండేది. సాధారణంగా వైద్యులు స్వల్పకాలానికి మందులు ఇస్తారు. వాటిని వాడి మరోసారి కలవాలని సూచిస్తారు. అప్పుడు 15 రోజుల్లో రెండోసారి వెళ్లినా ఓపీ ఫీజు వసూలు చేసేవారు కాదు. కానీ ఇప్పుడు వారం రోజుల కాలపరిమితికి మాత్రమే ఓపీ టోకెన్ అందిస్తున్నారు. పది రోజులకు తగ్గట్టు మందులు అందించి వాటిని వాడిన తరువాత మళ్లీ రావాలని సూచిస్తున్నారు. దీంతో ఆ టోకెన్ చెల్లుబాటు కావడం లేదు. మళ్లీ డబ్బులు కట్టి టోకెన్ పొందాల్సి వస్తోంది. దీనిపై రోగి బంధువుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక టోకెన్‌తో రెండుసార్లు వైద్యం అందేదని.. ఇప్పుడు టోకెన్ ధర పెరిగినా.. ఒకసారికి మాత్రమే పరిమితమవుతోంది.

ల్యాబులు, మందుల షాపుల్లో..

ప్రైవేటు ఆస్పత్రులకు అనుబంధంగా ల్యాబులు, మందుల షాపులు నడుపుతున్నారు. బయట ల్యాబుల్లో వైద్య పరీక్షలకు తక్కువ ధర ఉంటే.. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు. బయట ల్యాబులను ఆశ్రయించి రిపోర్టును తీసుకెళ్తే సదరు వైద్యులు దానిని చూడడం లేదు. తిరస్కరించి బయటకు పంపుతున్నారు. ల్యాబుల్లో సైతం ల్యాబ్ టెక్నీషియన్లు ఉండడం లేదు. కచ్చితంగా అక్కడ నిబంధనల మేరకు ల్యాబ్ టెక్నిషియన్, ఓటీ అసిస్టెంట్ వంటి కోర్సులు పూర్తిచేసి అనుభవం ఉన్నవారినే నియమించాలి. కానీ అదెక్కడా అమలుచేస్తున్న దాఖలాలు లేవు. ఇక ఆస్పత్రిలో పనిచేస్తే అన్ ట్రైన్డ్ సిబ్బందితోనే మందుల దుకాణాలను సైతం నడిపిస్తున్నారు. ఇలా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన సగటు రోగిని పిప్పిచేస్తున్నారు. ఆర్థికంగా గుల్ల అయ్యే వరకూ వదలడం లేదు. ఇప్పటికైనా ప్రైవేటు ఆస్పత్రుల దందాపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

దద్దరిల్లిన కలెక్టరేట్

(ఐదో పేజీ తరువాయి)

దిశగా కృషి చేయడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు రూ.6,400 కోట్ల ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గజపతినగరం, విజయనగరం, రాజాం ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సొంత భవనాలు లేక అరకొర సదుపాయలతో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారన్నారు. శిథిలావస్థలోఉన్న సంక్షేమ హాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించాలని, మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం వేగవంతం చేయాలని, మెడికల్ కళాశాల నిర్మాణం వేగవంతం చేసి కళాశాలలో ఉన్న సీట్లన్నీ కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థి ప్రతినిధులు ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జే.రవికుమార్, ఎం.వెంకీ, సమీరా, రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు శిరీష, రాజు, జిల్లా కమిటీ సభ్యులు భారతి, రూప, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కటాఫ్ ఎంత?

(ఐదో పేజీ తరువాయి)

చేయనున్నారు.వచ్చే నెలలోవారంతా విధుల్లో చేరే అవకాశంఉంది. మున్సిప ల్, జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ పాఠశాలలు, ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధించనున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం మెగా డీఎస్సీ మెరిట్‌లిస్ట్‌లో జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌కు కాల్‌లెటర్లు పంపుతారు. వాటిని అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకొని అందులో ఉన్న సూచనలు పాటించాలి. వారికి కేటాయించిన తేదీ, సమయానికి ధ్రువపత్రాల పరిశీలనకు తప్పకుండా హాజరుకావాల్సి ఉంది. పోస్టులకు ఎంపిక పూర్తిగా ప్రతిభ, అర్హత, నియమ నిబంధనలకు ఆధారంగా జరుగుతుందని మెగా డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు 12 బృందాలను ఏర్పాటు చేసే అవకాశముంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి 24 మంది బృందం విజయవాడలో శిక్షణ పొందింది. డెంకాడ మండలం మోదవలస ఓయో ఇంటర్నేషనల్ స్కూల్‌లో 28న ఉదయం తొమ్మిది గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని విజయనగరం డీఈవో మాణిక్యాలనాయుడు తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన వారంతా పోస్టుకు ఎంపికైనట్టు కాదన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఆదరించాలి.. అప్రమత్తంగా ఉండాలి!

(ఐదో పేజీ తరువాయి)

వెనుకడుగు వేయవన్న విషయాన్నిగ్రహించాలి.సాధారణంగా మనజిల్లాలో సామాన్యులు వీధి కుక్కలనే పెంచుతుంటారు. స్థోమత ఉన్నవారు మాత్రం మేలుజాతి కుక్కలను పెంచుతుంటారు. అయితే కుక్కల పెంపకంపై ప్రేమ ఉన్నవారు వాటి పెంపకం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కుక్కల నివాస స్థలాలను ప్రతిరోజు డెటాల్, ఫినాయిల్ ద్రావణంతో కడగాలి. శుభ్రమైన పాత్రల్లోనే వాటికి ఆహారం, నీరు అందించాలి. వాటి శరీరంపై గాయాలైన ప్రదేశాలను వీలైనంత వరకూ తాకకుండా ఉండాలి. వాటికి ఎప్పటికప్పుడు వైద్యం అందిస్తుండాలి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాటికి స్నానం చేయించాలి.అవి ఉండేచోట గాలి,వెలుతురు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. రేబిస్ సోకకుండా మాత్రం వ్యాక్సినేషన్ తప్పనిసరి.

జిల్లాలో దాదాపు లక్షకుపైగా వీధికుక్కలు ఉంటాయని ఒక అంచనా. కానీ నిర్దిష్టంగా వాటి సంఖ్యను గుర్తించలేకపోతున్నారు. గతంలో సంతానోత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. స్థానిక సంస్థలకు ఆ బాధ్యతలు అప్పగించేవారు. అయితే కుక్కల నియంత్రణకు ప్రభుత్వం నిధులు నిలిపివేసింది. దీంతో ఆపరేషన్లు అటకెక్కాయి. వీధి కుక్కల నియంత్రణకు విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు మునిసిపాల్టీల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేశారు. విజయనగరంలో గ్రంధి కిత్తయ్య కోనేరు వద్ద రూ.30 లక్షలతో షెడ్లు కూడా ఏర్పాటుచేశారు. ఐదేళ్ల కిందట శస్త్రచికిత్సలు కూడా చేశారు. 3,900 కుక్కలకు అప్పట్లో ఆపరేషన్లు కూడా చేశారు. తరువాత ఎందుకో ఆపేశారు.

కుక్కలు అని పిలిస్తే మనసు చివుక్కుమంటుంది

మేము పెంచుకునే కుక్కలకు ప్రత్యేకించి పేర్లు ఉన్నాయి. వాటిని కుక్కలు అని ఎవరైనా అంటే మనసు చివుక్కుమంటుంది. కుటుంబసభ్యుల మాదిరిగా పేర్లు పెట్టి పిలిస్తే వాటికి ఎంతో ఆనందం. విషసర్పాలు చొరబడితే ప్రాణాలకు తెగించి మరీ పోరాడుతాయి. అపరిచితులు ఎవరైనా వస్తే గగ్గోలు పెడతాయి. మళ్లీ మేము ఊరడిస్తేనే మిన్నకుంటాయి. లేకుంటే బిగ్గరగా అరిచి మరీ తమ విశ్వాసాన్ని, కర్తవ్య దీక్షను చాటుకుంటాయి. రోజంతా కనిపించకుండా ఉంటే తల్లడిల్లిపోతాయి.

- రాజగోపాలనాయుడు, సామాజిక కార్యకర్త, బొబ్బిలి

పారదర్శకంగా కూటమి పాలన

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వ హయాంలో పారదర్శకమైన పరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. సోమవారం స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల లబ్ధిదారులకు 82,958 క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తహశీల్దారు మలపురెడ్డి శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,600 కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేశారన్నారు. సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ మాట్లాడుతూ బొబ్బిలి పట్టణ, మండలానికి కలిపి 67 రేషన్ షాపుల పరిధిలో 35,258 కార్డులు, రామభద్రపురం మండలంలో 33 షాపుల పరిధిలో 15,020 కార్డులు, బాడంగి మండలంలో 37 షాపుల పరిధిలో 14,420 , తెర్లాం మండలంలో 58 షాపుల పరిధిలో 18,233 స్మార్ట్‌రేషన్ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, రౌతు రామ్మూర్తి, అల్లాడ భాస్కరరావు, బొంతు త్రినాథ, వెలగాడ హైమావతి, కళ్యంపూడి సత్యనారాయణ, బీసపు పార్వతి, నాలుగు మండలాల తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, డీలర్లు పాల్గొన్నారు.

●బాడంగి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బాడంగిలో స్మార్ట్ రేషన్‌కార్డులను సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. డీలరు, సచివాలయసిబ్బంది ఇంటింటికి వెళ్లి అందజేశారు.



బొబ్బిలికోటలో టీడీపీలో చేరిన ఆనవరం గ్రామస్థులతో బేబీనాయన

టీడీపీలో ఆనవరం గ్రామస్థుల చేరిక

బొబ్బిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాడంగి మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. బొబ్బిలి కోటలోని ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో చేరారు. ఈమేరకు టీడీపీ కండువాలు వేసి వారికి వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరికి సింహాచలం, బలిజిరెడ్డి రాంబాబు, వాకాడ ఎర్రంనాయుడు, పతివాడ రామకృష్ణ, రాపాక రామకృష్ణ పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు హర్షణీయం



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు హర్షణీయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు జిల్లా ప్రజలు, రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కృషి విజ్ఞాన కేంద్రం కోసం 20 ఎకరాల స్థలం కేటాయించి, 15 మంది శాస్త్రవేత్తలను నియమించినట్టు చెప్పారు. ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో జిల్లాలో పలు రైల్వే, రహదారుల అభివృద్ధి పనుల కోసం చర్చించామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన

బొబ్బిలి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు ఉపయోగించకుండా అందుబాటులో ఉండే కషాయాలు, ద్రావణాల వాడకంతో కూడిన పంటలకు ప్రాధాన్యత ఉందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు తెలిపారు. సోమవారం మండలంలోని పారాదిలో పలుపత్ర జిల్లేడు ద్రావణా తయారు చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు, సత్యనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

నాగావళిలోకి చేరిన గుర్రపు డెక్క



నారాయణపురం కుడి కాలువ కవర్ వెండ్స్ వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క

సంతకవిటి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మడ్డువలస నుంచి నాగావళి నదిలోకి వస్తున్న వరద ఉధృతితో గుర్రపు డెక్క భారీగా చేరింది. ఈ గుర్రపు డెక్క ఆనకట్టుపై ఉన్న 118 షట్టర్లకు కుడి ప్రధాన కాలువ రెగ్యులేటర్ కవర్ వెండ్స్‌కు అడ్డంగా ఉండిపోవడంతో నదిలో వరద ఉధృతి కిందికి వెళ్లేందుకు ఆటంకం ఎదురయ్యింది. ఈ విషయం తెలిసిన ఇరిగేషన్ డీఈఈ రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో ఏఈలు రాంబాబు, రామ్‌శివాజీలు ఇరిగేషన్ లస్కర్లతో సోమవారం కవర్ వెండ్స్ వద్ద ఉన్న గుర్రపు డెక్కను తొలగించారు. కవర్ వెండ్స్ వద్ద భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపునకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

బాల్య వివాహాలు నేరం

గజపతినగరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం మరుపల్లిలో గల ఓలం కంపెనీలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

రాజాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని రాజాం సహాయ కార్మిక శాఖ అధికారి బి.కొండలరావు అన్నారు. అంతికాపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 19 నుండి 59 ఏళ్ల లోపు కార్మికులు ఈ-శ్రమ పోర్టల్‌లో వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చీపురుపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల ఏర్పాటులో నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకూడదని తెలిపారు.

శ్రీదేవికి తెలుగుతేజం పురస్కారం

చీపురుపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.ములగాంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గంపా శ్రీదేవి తెలుగుతేజం పురస్కారానికి ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా నరసారావుపేట కేంద్రంగా పనిచేస్తున్న కళావేదిక సంస్థ నుంచి ఆమెకు సమాచారం అందింది. పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్న ఆమె కొంత కాలంగా కథలు, వచన కవితలు,పద్యాలు రాస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు. తెలుగు భాషకు చేస్తున్న సేవకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా మహేష్‌కుమార్

సంతకవిటి,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):సంతకవిటి పీఏసీఎస్ చైర్మన్‌గా చెలికాని మహేష్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ హాజరయ్యారు.రాష్ట్ర తూర్పుకాపు మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడుతో కలిసి మహేష్‌కుమార్‌ను సత్కరించారు. కాగా శ్రీహరినాయుడుపేటలో ఇటీవల అగ్నివీర్ ర్యాలీకి వెళ్లి చనిపోయిన గంట్రేటి సాయికిరణ్ కుటుంబాన్ని పరామర్శించారు. కొండగూడెం సమీపంలో సాయన్న గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోండ్రు జగదీష్, బొత్స వాసుదేవనాయుడు,నారాయణరావు, వల్లూరుగణేష్, గట్టిభాను పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు పరిశీలన

శృంగవరపుకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పుణ్యగిరి రోడ్డులోని పంచాయతీ రాజ్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన వాటర్ ట్యాంకును జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో మల్లికార్జునరావు, గ్రామీణ తాగునీటి సరఫరా ఎస్ఈ కవిత, డీఈఈ పైడిరాజు, జేఈ కిశోర్, ఈవోపీఆర్డీ వీవీ లక్ష్మి, ఈవో వీవీ అనురాధలు సోమవారం పరిశీలించారు. వీటితో పాటు జలజీవన్ మిషన్ కొళాయిలను తనిఖీ చేశారు.

●కొత్తవలస, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో రూ.61లక్షలతో నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు. అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను ఆమె సోమవారం పరిశీలించారు. అలాగే ఆమె మండలంలో పర్యటించి, స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

డెంకాడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గంలోని బీసీ విద్యా ర్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవోకార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ సలహా సంఘం ఆధ్వర్యంలో బీసీ వసతిగృహాల విద్యార్థుల ప్రవేశాల కోసం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వి.రాజులమ్మ, డెంకాడ ఎంపీపీ వాసుదేవరావు, ఎంపీడీవో భవాని, బీసీ హాస్టల్ వార్డెన్స్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

రాజాం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని ఈనెల 28న నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని ఆటోవర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, అధ్యక్షుడు కోటి పిలుపునిచ్చారు. ఈ మేరకు పలు డిమాం డ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు సోమవారం అందజేశారు.

బార్లపై తగ్గిన ఆసక్తి

(ఐదో పేజీ తరువాయి)

మాదిరిగానే లాటరీ తీస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే ఇక్కడే ఒక మెలిక పెట్టింది. ఒక్కో బారుకు 4 దరఖాస్తులు ఉంటేనే లాటరీ తీస్తామని చెప్పడంతో వ్యాపారులు వెనక్కి తగ్గారు. దరఖాస్తు రుసుం కింద సుమారు రూ.5.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఇది నాన్ రిఫండబుల్. అయితే ఈ విషయంలో ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినా..నాలుగు దరఖాస్తులు రాకపోతే..లాటరీ తీయకపోగా రూ.5.10 లక్షలు తిరిగి ఇవ్వరట. ఈ కారణంగానే ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. ఏడాదికి రూ.55 లక్షలవరకూ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అంటే దానికి మించి ఆదాయం వస్తే కదా బార్లు నడిపేది. అందుకే మద్యం దుకాణాల్లో ఎదురైన పరిణామాల దృష్ట్యా ఎక్కువ మంది విముఖత చూపుతున్నారని తెలిసింది. ఆ వ్యాపారంలో అనుభవం ఉన్నవారు సైతం చేతులు కాల్చుకుంటామా? అంటూ ఎదురుప్రశ్న వేస్తున్నారు.

● ఎడిషనల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్, నాన్ రిఫండబుల్ నగదు, పర్మిట్ రూమ్‌లు, విధిగా నాలుగు దరఖాస్తులు ఉండాలన్న నిబంధనతో ఎవరూ ముందుకురాని పరిస్థితి ఉంది. అందుకే బార్ పాలసీ విషయంలో ప్రభుత్వం పునఃసమీక్షించుకోవాలని.. 2014 నుంచి 2019 మధ్య ఉన్న బారు పాలసీని పునరుద్ధరించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. మరి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

నేటితో ముగియనున్న గడువు

జిల్లాలో 28 బార్లకుగాను మంగళవారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగియనుంది. సోమవారం సాయంత్రం నాటికి 42 రిజిస్ట్రేషన్లుఅయ్యాయి. ఇద్దరు డబ్బులు చెల్లించారు. మంగళవారం చివరి రోజు కావడంతో రిజి స్ట్రేషన్లు చేసుకున్నవారు మొత్తాన్ని చెల్లించే అవకాశంవుంది. కొత్త వారు సైతం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు లాటరీ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

-శ్రీనాథుడు, జిల్లాఎక్సైజ్ అధికారి, విజయనగరం

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

బొబ్బిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో సోమవారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీని పలు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు.స్థానిక ఎస్‌టీవో కార్యాలయంలో సబ్‌ట్రెజరీ అధికారి పీవీ పద్మనాభం ఆధ్వర్యంలో స్పార్క్ సొసైటీ సౌజన్యంతో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే బేబీనాయన చేతుల మీదుగా పంపిణీ చేశారు కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు రౌతు రామ్మూర్తి, స్వామినాయుడు, ముగడ అనిల్‌కుమార్‌యాదవ్, చెలికాని కేశవ పాల్గొన్నారు. అలాగే బొబ్బిలికి చెందిన గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి, సామాజిక కార్యకర్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు మింది విజయ మోహనరావు, కె.కృష్ణదాసు, చిట్టిమోజు ఉషారాణి , మానవ హక్కుల సంఘం మహిళానేత చింతా శారద, పట్టణ టీడీపీ అధ్యక్షుడు, వ్యాపారవేత్త గెంబలి శ్రీనివాసరావు విగ్రహాలను పంపిణీ చేశారు.

మహాసభకు ఆహ్వానం

బొబ్బిలి రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా ఈనెల 30వ విజయవాడలో నిర్వహించే సంచార/అర్థ సంచారజాతుల స్ఫూర్తి మహాసభలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో తూర్పు భాగవతం ప్రదర్శన కోసంఆహ్వానంఅందినట్లు కోమటిపల్లికి చెందిన తూర్పు భాగవతంనిర్వాహకులు బొంతలకోటి శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.సభలో తమకు అవకాశందొరకడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):తమ దివ్యాంగ పింఛన్ పునరుద్ధరించాలని పలువురు కోరారు.ఈ మేరకు పింఛన్ రద్దైన దివ్యాంగులు సోమవారం బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. రీవెరిఫికేషన్‌లో కొంత మంది దివ్యాంగుల పింఛన్లు రద్దుకావడంతో తిరిగి అప్పీలో చేసుకోవడానికి అవకాశం ఇవ్వడంతో వారంతా అధికారులకు అప్పీల్ పత్రాలు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బొబ్బిలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారంబొబ్బిలికోటలో ఎమ్మెల్యే బేబీనాయన పంపిణీ చేశారు. తెర్లాం మండలంలోని మోదుగువలసకు చెందిన గొట్టాపు సత్యంకు రూ.2.76 లక్షలు, పట్టణ ఇందిరమ్మకాలనీకి చెందిన కల్ల నారాయణరావుకు రూ.1.58 లక్షలు చొప్పున మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, టీడీపీ నాయకులు రెడ్డి మురళి, ఏగిరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

బొబ్బిలిలో రక్తదాన శిబిరం

బొబ్బిలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంస్థ నిర్వాహకురాలు బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఎస్‌టీవో పద్మనాభం రక్తదాతలను అభినందించారు.

ఫిర్యాదులను పరిష్కరించండి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలం నుంచి వచ్చిన రెవెన్యూకి సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భాగంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ నిర్వహించిన వెబ్‌ఎక్స్ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఈడీటీ గౌరిశంకరరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.





